క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య మహిళా కార్మికులకు స్థానిక నాయకులు చిట్టిపిల్లి గోపి చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఆయన కుమార్తె అను ప్రియాంక 15వ వర్ధంతి సందర్భంగా వార్డులో సుమారు 40 మంది కార్మికులకు వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, బోడపూడి దొరబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపు కోసం ప్రచారం



ఉపాధ్యాయలను ఓటు అర్థిస్తున్న అజ శర్మ

మధురవాడ: ప్రగతి శీల శక్తి గల అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఏ. అజ శర్మ కోరారు. గురువారం ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికోరెడ్ల విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ మధురవాడ,పీఎంపాలెం, కొమ్మాది పరిసర ప్రాంతాలలో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్, ఎం. కుమార మంగళం, రఘుపతి వెంకటరమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వలందపేట ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట శ్రీవిద్యాగణపతి సహిత సుబ్రహ్మణ్యం, అయ్యప్పస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అర్చకులు సునరాపు మధుశర్మ, కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, హోమం, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన , సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, నగిరెడ్ల రాంబాబు, బోయి అప్పలరెడ్డి, వెంకటరెడ్డి, చిల్ల సూరిదాసు, జీరు వెంకటరెడ్డి, ఎరుసు అప్పారావు, నీలాపు శివశంకర్‌రెడ్డి, చిల్ల అప్పలరెడ్డి, శిల్లా వంశీరెడ్డి, కోల అప్పారావు, పలివెల చిన్న డెక్కతి శివ, మొక్క శ్రీను, బోయి మహలక్ష్మి, పోతురాజు, మొక్క సూర్యనారాయణ, సరగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు



ప్రవచనం వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: తాను ఎన్ని కష్టాల్లో ఉన్నా ధర్మాచరణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినవారు శ్రీరాముడు అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. మధురవాడ గాయిత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణంలో అరణ్యాకాండలో సీతాపహరణ తర్వాత జరిగిన సంఘటనలు గురించి గురువారం ప్రవచించారు. మారీచుని మరణానంతరం అనేక దుశ్శకునములను చూసిన శ్రీరాముడు ఆర్తితో వెనుకకు వస్తూ మధ్యలో లక్ష్మణుని కలుసుకుని సీతమ్మ ఆపదలో ఉండి కొంత నిందించినా అక్కడ నుంచి వచ్చేయడం ముమ్మాటికీ తప్పేనని చెప్పారు. పర్ణశాలకు వెళ్లిన తర్వాత సీతమ్మ కనిపించకపోవడం ఆమె కోసం శ్రీరాముడు బాధతో గోదావరి నదిని, పశుపక్ష్యాదులును కూడా అడిగిన తీరు వివరించారు.



కనువిందు చేస్తున్న పచ్చదనం



↑ శిథిలమైన ఫౌంటైన్



శిథిలావస్థకు చేరుకున్న క్యాంటీన్

అద్భుత ప్రదేశం

అంతులేని నిర్లక్ష్యం

పచ్చదనం ఉన్నా.. సౌకర్యాలు సున్నా ■ అభివృద్ధికి నోచుకోని సీ వ్యూ పార్కు

కొమ్మాది: ఎదురుగా సముద్రం. పక్కనే బౌద్ధారామం అయిన తొట్లకొండ. వీటి మధ్య సీవ్యూ పార్కు. ఎక్కువ మంది సందర్శకులు మెచ్చిన పార్కు. భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలో చుట్టూ విశాలమైన ప్రదేశంలో రూపుదిద్దుకుంది. కనుచూపు మేర ఆహ్లాదాన్ని పంచే పచ్చదనం దీని సొంతం. అయితే ప్రస్తుతం ఈ పార్కులో పచ్చదనం పుష్కలంగా ఉన్నప్పటికి, దీని చుట్టూ ఉన్న ప్రదేశాలు దట్టమైన అడవిని తలపిస్తున్నాయి. అంతేకాదు గతంలో ఏర్పాటు చేసిన ఫౌంటైన్ శిథిలావస్థకు చేరింది. క్యాంటీన్ నిర్వహణ లేకపోవడంతో మూలకు చేరింది. దీంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు అసహనానికి గురవుతున్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

విశాఖ పేరు చెప్పగానే సువిశాలమైన సాగర తీరం.. అందమైన బీచ్‌లు మదిలో మెదులుతాయి. కానీ బీచ్‌లు మాత్రమే కాదు.. బోలెడన్ని పర్యాటక ప్రాంతాలు, చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న అనేక ప్రదేశాలు ఉన్నాయి. మనల్ని రెండు వేల ఏళ్లు వెనక్కి తీసుకెళ్లే అద్భుతమైన ప్రదేశం నగర శివార్లలో ఉంది. అదే తొట్లకొండ బౌద్ధారామ క్షేత్రం. ఇంత ప్రసిద్ధి చెందిన బౌద్ధారామం సమీపంలో సీ వ్యూ పార్కు కూడా పర్యాటకులను ఫిదా చేస్తుంది. అయితే ఇది గతం మాట..ఇప్పుడు ఇక్కడ అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. విశాఖ వచ్చిన పర్యాటకులు కచ్చితంగా భీమిలి బీచ్, తొట్లకొండ, బావి కొండ, రుషికొండ బీచ్, సీవ్యూ పార్కు సందర్శిస్తుంటారు. సీ వ్యూ పార్కు మాత్రం పర్యాటకులను నిరుత్సాహపరుస్తోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టూరిజం అధికారులు ఇక్కడ ఉన్న ఖాళీ స్థలాన్ని అభివృద్ధి చేసి ఓ వైపు పచ్చనం సంరక్షిస్తూ, మరో వైపు పిల్లలు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కుగానీ, సీనియర్ సిటిజన్ల కోసం వాకింగ్ ట్రాక్ గానీ ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గేటు

ఈ పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ గోడ కూడా శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే కొన్ని చోట్ల కూలిపోయింది. అదే విధంగా ఇక్కడ ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేటు పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. రక్షణ గోడ చుట్టూ పెద్ద పెద్ద చెట్లు పెరిగి పోవడంతో అడవిని తలపిస్తోంది. వీటిని చూసి పర్యాటకులు వద్దామన్నా భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఈ సీవ్యూ పార్కులో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.



పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న గేటు

నిరాశతో వెనుదిరిగాం

తొట్లకొండపై కుటుంబంతో కలిసి గడిపేందుకు అంతగా సౌకర్యాలు లేవు. ఎందుకంటే ఇక్కడ ఉండేందుకు చెట్లు, నీడ లేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంది. అందుకే ఇక్కడ దగ్గరగా ఉన్న సీ వ్యూ పార్కులో గడిపేందుకు అవకాశం ఉన్నప్పటికీ టూరిజం అధికారులు అభివృద్ధి చేయడం లేదు. పార్కు అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందడం ఖాయం. – సరస్వతి, వైజాగ్

సౌకర్యాలు కల్పించాలి

ఇక్కడ సీవ్యూ పార్కులో కుటుంబంతో కలిసి గడిపేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయితే మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులు వెనుదిరుగుతున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేయాలి

– ఎస్. రవిశంకర్, ఎంపీపీ కాలనీ



పార్కు చుట్టూ భయానక వాతావరణం

కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదు

కొమ్మాది: మానవ మేధస్సుకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదని, జీవ శాస్త్రాలను అభ్యసించే విద్యార్థులు లోతైన విషయ పరిజ్ఞానంతో పరిశోధనా దృష్టితో అవకాశాలను అందుకోవాలని గీతం డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ అన్నారు. గీతంలో గురువారం ఔషధ, జీవ శాస్త్ర పరిశ్రమల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. జీవశాస్త్రం రంగంలో పరిశోధనలకు ఆకాశమే హద్దు అని, ముఖ్యంగా విద్యార్థులు తాము చదివే అంశాలకు చుట్టూ ఉండే ప్రకృతి నుంచి ఉదాహరణలుగా తీసుకుని ప్రతి అంశాన్ని పరిశోధనకు ఎంచుకోవచ్చు అని సూచించారు.

నేటి నుంచి శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాలు



ప్రారంభానికి సిద్ధంగా చైతన్య భవనం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులో శుక్రవారం నుంచి అయిదురోజుల పాటు శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన చైతన్య భవనాన్ని ప్రారంభించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ స్థానిక అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు వాస్తు యజ్ఞంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు దాన్యాధివాసం, శాంతి యజ్ఞం సాయంత్రం జలాధివాసం, నిత్య యజ్ఞం జరుగుతాయి. 16న ఉదయం నేత్రోన్మీలం , కర్మాంగ సపన్నం, ఛాయాదివాసం, పుష్పాదివాసం, శయనాధివాసం, 17న ప్రతిష్ఠమూర్తి బింబ స్థాపన, మహాకుంభ ప్రోక్షణ, విశ్వరూప దర్శన, ప్రథమ విశేష అభిషేకం, 18న ప్రథమ ఆరాధన, అష్టోత్తర అర్చన జరుగనున్నాయి. వివరాలకు 95425 11108ను సంప్రదించాలని అంబరీష దాస తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పదవులు

తగరపువలస: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో భీమిలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. వీరిలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడుకు జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా, ఆనందపురం మండలం గండిగుండం సర్పంచ్ గంట్రెడ్డి శ్రీనివాస్‌కు జిల్లా ప్రధాన కార్యర్శిగా, జీవీఎంసీ భీమిలి జోన్ యూత్ నాయకులు బింగి హరికిరణ్ రెడ్డికి జిల్లా అధికార ప్రతినిధిగా పదవులు లభించాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



బోని బంగారు నాయుడు



గంట్రెడ్డి శ్రీనివాస్



బింగి హరికిరణ్‌రెడ్డి

బకాయిలు చెల్లించే వరకు ఆస్తులు విక్రయించకూడదు



జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుతో భేటీ అయిన కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యజమాని బజోరియా బకాయిలు చెల్లించే వరకు మిల్లు ఆస్తులు విక్రయించకూడదని జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు అన్నారు. గురువారం మిల్లు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు జేసీఎల్ రామారావు సమక్షంలో మిల్లు ప్రతినిధులతో చర్చలు జరిపారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆస్తులు అలాగే ఉంచాలన్నారు. మిల్లు తరపున లలిత్‌కుమార్ పాల్గొనగా కార్మిక సంఘాల నుంచి కాకర్లపూడి వరహాలరాజు, చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, పడాల రమణ, అల్లు బాబూరావు, మద్దుల దేవుళ్లు, చిల్ల రాంపైడి, కొయ్య సూరిగురువులు, కొండపు ఈశ్వరరావు, సాడి అచ్చారావు, నరవ రామారావు, సరగడ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోరుతూ ర్యాలీ



తగరపువలస ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న పెన్షనర్లు

తగరపువలస: పెన్షన్ పెంపుదల కోరుతూ ఢిల్లీలో కార్మిక సంఘాలు మూడు రోజుల పాటు చేపడుతున్న కార్యక్రమాలకు సంఘీభావంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్లు గురువారం అంబేడ్కరు కూడలి, ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని కనీస పెన్షన్ రూ.9వేలు చేయాలన్నారు. పెన్షనర్లకు రైల్వే చార్జీలలో రాయితీ, ఆస్పత్రులలో వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్యనారాయణ, చిల్ల అప్పారావు, జీరు సత్యారావు, ఆదినారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కుంతీ మాధవ స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



కల్యాణోత్సవాలపై కుంతీ మాధవ స్వామి ఆలయంలో చర్చిస్తున్న భక్త బృందం సభ్యులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వచ్చే నెల 9 నుంచి 15 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భక్తులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఈవో నానాజీ బాబు అన్నారు. కల్యాణోత్సవాల నిర్వహణపై కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం భక్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న పుష్ప యాగం, 10న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు కల్యాణం, 12న తెప్పోత్సవం, 13న రథోత్సవం, 14న డోలామండపానికి స్వామి వేంచేయుట, 15న పుష్ప యాగం జరుగుతుందన్నారు.నీ సందర్భంగా ఏర్పాట్లపై నిర్వాహక కమిటీ చర్చించింది. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, రామసింగు సన్యాసిరావు, కంటుబోతు ఎర్నాయుడు, బుగత సత్యనారాయణ, తాలాడ పైడిరాజు, మొకర సన్నిబాబు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



చిప్పాడలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దివీస్ సామాజిక సేవ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం గురువారం చిప్పాడలో 170 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత డిసెంబర్‌లో చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో నగరానికి చెందిన ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి బృందం పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అవసరమైన 170 మందికి రూ.1.48 లక్షల విలువైన కళ్లద్దాలు అందించినట్టు సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో శివరాణి, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి సరోజినీ నాయుడు



సరోజినీ నాయుడు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

మధురవాడ: బ్రిటిషు వారికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సరోజినీ నాయుడు పోషించిన పాత్ర అనిర్వచనీయమని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో సాంఘిక శాస్త్రం విభాగం, ఎన్‌సీసీ మహిళా క్యాడెట్ల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు, కో ఆప్షన్ సభ్యులు, ఉపాధ్యాయునులు వరలక్ష్మి, తులసి పాల్గొన్నారు.



సరోజిని నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీతామహలక్ష్మి

ఆదర్శంగా తీసుకోవాలి

తగరపువలస: సమాజంలో మహిళలంతా సరోజినీ నాయుడును ఆదర్శనీయంగా తీసుకోవాలని ప్రముఖ సామాజిక కార్యకర్త గూడూరు సీతామహలక్ష్మి అన్నారు. సంగివలస అనిట్స్‌లో జరిగిన జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో సరోజినీ నాయుడు జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ , మహిళా గ్రీవెన్స్ సెల్ చైర్ పర్సన్ వి.రాజ్యలక్ష్మి, ఆంగ్ల విభాగాధిపతి ఎ.సత్యఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు నిరుపయోగం



నారాయణ గజపతిరాజు పురం వద్ద సర్వీస్ రోడ్డులో నిర్మించిన బస్ షెల్టర్

తగరపువలస: జాతీయరహదారుల విస్తరణ సమయంలో సర్వీస్‌రోడ్లను ఆనుకుని నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. నారాయణ గజపతిరాజు పురం వద్ద బస్ షెల్టరే ఇందుకు నిదర్శనం . ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో ఉన్న ఈ షెల్టర్ వద్ద బస్సులు నిలపడం లేదు. దీనికి దగ్గరలోని సింహాచలం క్రాస్‌రోడ్డు వద్ద మాత్రమే సిటీ బస్సులు ఆపుతున్నారు. దీంతో నారాయణ గజపతిరాజు పురం బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. ఇదే విధంగా జాతీయరహదారి వెంట చాలా బస్ షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకువచ్చి ప్రజాధనానికి సార్థకం చేయాలని పలువురు కోరుతున్నారు.



శిథిలమైన షెల్టర్

వివాహిత మృతి



రక్షణకుమారి (ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద దేవి స్వీట్స్ షాప్‌లో గురువారం పని చేస్తూ పోలిపల్లి రక్షణకుమారి (32) అనే వివాహిత మృతి చెందింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లికి చెందిన రక్షణకుమారి కొంతకాలంగా ఇక్కడే పని చేస్తోంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరినప్పుడే ఒంట్లో నలతగా ఉందని భర్త శివకుమార్‌కు చెప్పింది. అయినప్పటికీ వచ్చి పనులు చేస్తూ కింద పడిపోయింది. వెంటనే అక్కడివారు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకురావాలి



మాట్లాడుతున్న ఎస్‌టీపీఐ అదనపు డైరెక్టర్ సురేష్ బాతా

తగరపువలస: ఇది స్టార్టప్‌ల యుగమని విద్యార్థులు స్టార్టప్‌లు ప్రారంభించడానికి వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)అదనపు డైరెక్టర్ సురేష్ బాతా అన్నారు. గురువారం సంగివలస అనిట్స్‌లో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో ఎస్‌టీపీఐ పాత్ర గురించి అతిథి ఉపన్యాసం చేశారు. డేటాకామ్ సేవలు, ఇంక్యుబేషన్ సెంటర్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. దేశవ్యాప్తంగా ఎస్‌టీపీఐలకు 24 కేంద్రాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ స్టార్టప్‌లు అభివృద్ధి చేసుకునేందుకు అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. హ్యాకథాన్, ఓపెన్ ఛాలెంజ్ 5.0లలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ, ఐఐసీ కన్వీనర్ పి.మురుగపాండియన్, హెచ్‌వోడీ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.